క్లుప్తంగా

సూర్యదేవాలయంలో ప్రత్యేక పూజలు



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి సూర్యదేవాలయ ఆవరణలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 3వ తేదీ నుంచి నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహిసునట్లు వివరించారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు.

పాఠశాలకు టేబుళ్ల వితరణ

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు పూర్వ విద్యార్థి కొత్త నరేందర్‌రెడ్డి రూ.70 వేలు విలువ చేసే 60 టేబుళ్లను సోమవారం వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా టేబుళ్లను అందజేసినట్లు దాత నరేందర్‌రెడ్డి తెలిపారు. మున్ముందు పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో టై, బెల్టులను డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రాజేందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని కోరారు. క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ సూచన మేరకు దాత మోహనయ్య సహకారంతో పాఠశాలకు మైక్‌సెట్ అందించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేందర్, ఉపాధ్యాయులు శ్రీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఐక్యతను చాటుదాం



తాడూరు: హైదరాబాద్‌లో 7న నిర్వహించే లక్ష డప్పులు–వేయి గొంతుకల కార్యక్రమంలో మాదిగలు అధిక సంఖ్యలో హాజరై ఐక్యతను చాటుదామని ఎమ్మార్పీఎస్ నాయకులు ఐతోలు లక్ష్మయ్య, రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పాపగల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ దండోరా మండల నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు వేస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, బాలెంకటయ్య, రవిందర్, శ్రీశైలం, జగన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ జిల్లా కమిటీ ఎంపిక



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎంఈఎఫ్(మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్) జిల్లా కమిటీని రాష్ట్ర కార్యదర్శి యాదయ్య సమక్షంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా దేవరపాగ ప్రభాకర్ 3వ సారి ఎంపికయ్యారు. కార్యదర్శిగా సుద్దపాగ వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాలే శ్రీనివాసులు, కోశాధికారిగా ఆదిసురేందర్, ఉపాధ్యక్షుడిగా నాగశేషు, శ్రీనివాసులు, భీముడు, పాండు, మహిళా కార్యదర్శిగా భీమమ్మ, సంయుక్త కార్యదర్శులుగా మనోజ్, చంద్రయ్య, అంజయ్య, స్వామి, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, శివశంకర్, చంద్రశేఖర్, విజయ్ కుమార్, కృష్ణ, రాములు, సరేష్, లక్ష్మీప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా డీవీ స్వామి, సుదర్శన్‌లను ఎంపిక చేశారు.

కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం

- ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్న విద్యాశాఖ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసే యోచన



తాడూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల

నాగర్‌కర్నూల్: గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలల్లో చదివేందుకు వచ్చే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలు, సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు సంబంధించి మెస్‌చార్జీలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు కళాశాల విద్యార్థుల ఆకలి తీర్చేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఇంటర్మీడియట్ విద్యాశాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఎంత మంది విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, ఒక్కో విద్యార్థికి ఎంత ఖర్చవుతుందనే విషయంపై ప్రతిపాదనలను సైతం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

హాజరు శాతం పెరిగే అవకాశం

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ కళాశాలలకు 16 ఉండగా అందులో ప్రథమ సంవత్సరంలో 6483 మంది, ద్వితీయ సంవత్సరంలో 6823 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మొత్తం 13872 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఈ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ శాతం చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులే అధికం. రోజు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో డ్రాపౌట్లు కూడా పెరగుతున్నాయి. దీంతో ఈ ప్రభావం ఇంటర్ ఉత్తీర్ణత శాతంపై పడుతోంది. ఉత్తీర్ణత, హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతే కాకుండా వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజన తెచ్చుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యార్థులకు ఎక్కువ మేలు జరగనుంది. గతంలో 2018వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అక్షయ ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం పెట్టాలని భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తరువాత 2021 లో మరో మారు ఈ ప్రయత్నం చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రస్తుత ప్రభుత్వం భావించడంతో ప్రతిపాదనలు సమర్పించేందుకు ఇంటర్ విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.20 నుంచి రూ.25 లు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

ఎంతో ఉపయోగకరం



ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లి తిరిగి రావడం లేదు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలి. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎండీ అఫ్రోజ్, విద్యార్థి, తాడూరు

ప్రభుత్వం ఆదేశాలు అమలు చేస్తాం

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– వెంకటరమణ, ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్

ప్రజా సమస్యలపై పోరాడుతాం



ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

బిజినేపల్లి: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ అన్నారు. సోమవారం మండలంలోని నందివడ్డెమాన్‌లో సీపీఐ 100 సంవత్సరాల ఆవిర్భావం సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ఈర్ల చంద్రమౌళి, మండల కార్యదర్శి కృష్ణాజీలు మాట్లాడుతూ పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో చేసిన పోరాట ఫలితమే ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా ప్రభుత్వాలతో పని చేయించే సత్తా సీపీఐ పార్టీకే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, చిన్నపాగ శ్రీను, మలమ్మ, కావలి నాగేష్, ఊషమ్మ, పోచమ్మ, నాగయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తిరెడ్డిపల్లి గ్రామస్తుల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

కోడేరు: మండలంలోని ముత్తిరెడ్డిపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి మీదుగా ఉన్న రహదారి నిర్మాణ పనులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 1986లో అప్పటి ఎమ్మెల్యే హయాంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేశారని ఇప్పటి వరకు నూతన బీటీ రోడ్డు లేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని పనులు చేపట్టకపోతే ఆందోళన చేపడుతామన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డీఈ రమాదేవితో మాట్లాడారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తాడూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని పాపగల్‌ను, శిర్సవాడను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు, కబ్జాలను ప్రోత్సహించారని, పేదల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిరేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మారుతి



అచ్చంపేట రూరల్: శివసేన పార్టీ విద్యార్థి విభాగం విద్యార్థి సేన ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడిగా ఎడ్ల మారుతిని నియమించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని శివసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శివాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థి సేనను బలోపేతం చేస్తానన్నారు.

రీక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

వెల్దండ: మండల రీక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన నకెరకంటి శ్రీనివాసులును సోమవారం మండల కేంద్రంలో సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిష్టాల్, శివ, రాహుల్‌నాయక్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణ చేసే వరకు పోరాటం

కోడేరు: ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం సాగిస్తామని వెయ్యి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమ రాష్ట్ర సమన్వయ కర్త ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డప్పుస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు వెయ్యి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సోమనాథ్, రామకృష్ణ, కొమ్ము దానయ్య, శివ, లాలు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ రూ.6,496

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ పంటకు అత్యధికంగా రూ.6,496 ధర లభించింది. మోడల్ ధర రూ.5,610 ధర పలకగా, అతి తక్కువగా రూ.5,000 ధర లభించింది. మార్కెట్లో కందులకు రూ 6,465 ధర లభించింది. 332 మంది రైతులు 3,734 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి తీసుకొచ్చినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు.

జీవ పరిణామంపై విద్యార్థులకు అవగాహన



క్యూలో నిల్చున్న విద్యార్థులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు జీవ పరిణామం ఏర్పడిన విధానంపై సిద్విత్వ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో క్లోజ్ థియేటర్ ఏర్పాటు చేసి పలు విషయాలపై అవగాహన కల్పించారు. డైనోసార్లు అంతరించడానికి గల కారణాలు, అంతరిక్ష రంగంలో పాలపుంతలు ఏర్పడే విధానంపై వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, విద్యా కమిటీ సుధారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జైపాల్, శ్యామలాదేవి, నరసింహ, నారాయణ, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



కొల్లాపూర్: పట్టణంలో ఈదమ్మ దేవత విగ్రహ పునఃప్రతిష్ఠకు రావాలని సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆలయ కమిటీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 29 నుంచి 31 వరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మంత్రితో పాటు సురభిరాజ వంశ వారసులు ఆదిత్య లక్ష్మారావును కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ కమిటీ నాయకులు సాకలి నర్సింహ్మ, శివగారి రమేష్, మూగి వెంకటస్వామి, దాసరి నిరంజన్ తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పెద్దకారుపాములలో నిర్వహించిన ఉపాధ్యాయ కాంప్లెక్స్ మీటింగ్‌కు ఎంఈఓ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాణ్యతగా అందించాలన్నారు. విధులను నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు జియోద్దీన్, కాంప్లెక్స్ ప్రధాన కార్యదర్శి సాయిప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆచారిపై ఆరోపణలు సరికాదు



కల్వకుర్తి రూరల్: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారిపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎన్నం శేఖర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమి భయంతోనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, రాంభూపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, నరసింహ, బాలస్వామి, రవి గౌడ్, బండేల రామచంద్రారెడ్డి, నరేష్ గౌడ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి జ్ఞాన సరస్వతి ఆలయ వార్షికోత్సవం

కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో జ్ఞాన సరస్వతి దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 29 తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తునట్లు ఆలయ అధ్యక్షుడు ఆకారపు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మహాభిషేకం అఖండ దీపారాధన, గోపూజతో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజు చిన్నారులకు అక్షరభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



అచ్చంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు



ఉప్పునుంతలలో..

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మర్యాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1, 2025 నుంచి సీపీఎస్ స్థానంలో తీసుకురానున్న కొత్త స్కీం ఏకీకత పెన్షన్ స్కీమ్‌ను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రియాజ్, జిల్లా బాధ్యుడు మల్లేష్, సుభాన్, పర్వతాలు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత ఫించన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్. బీచ్యానాయక్ డిమాండ్ చేశారు. అచ్చంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీచ్యానాయక్ మాట్లాడుతూ...ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులు, అర్జున్ గౌడ్, పూర్ణస్వామి, లక్ష్మణ్, నర్సింహ పాల్గొన్నారు.

యూపీఎస్‌ను రద్దు చేయాలని వినతి

ఉప్పునుంతల: కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ భోజన విరామ సమయంలో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాయంలో డిప్యూటీ తహసీల్దార్ కేశవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలుచేయాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు సబావత్ బిచ్యానాయక్, పీఆర్టీయూ నాయకులు మల్లికార్జున్, శ్యాంసుందర్‌గౌడ్, అజ్మతుల్లా, నరసింహారెడ్డి, అమీర్‌పాషా, శ్రీధర్, రాములనాయక్, గోపి, శ్రీనివాస్, బాలకృష్ణ, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేయడం హేయమైన చర్య



మాట్లాడుతున్న సీహెచ్ శ్రీనివాసులు

మన్ననూర్: రైతులు సమస్యలు ఉంటే ప్రజాస్వామ్య బద్ధంగా సాధించుకోవాలని దాడులు చేయడం హేయమైన చర్య అని ఉమామహేశ్వర ఆలయం పాలక మండలి సభ్యురాలు సంబు శోభ వెంకటరమణ అన్నారు. అచ్చంపేట మార్కెట్ యార్డులో వేరుశెనగలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని మార్కెట్ చైర్మన్ రజిత భర్త అంతటి మల్లేష్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమస్యలు ఉంటే ప్రజాపాలన ప్రభుత్వంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎ రహీం, శ్రీనివాసులు, పంబలి బుచ్చయ్య, సత్యనారాయణ, వెంకటయ్య, తిరుపతి ఉన్నారు.

దాడులు సరికాదు

ఉప్పునుంతల: రైతులు భౌతిక దాడులకు దిగడాన్ని మండల కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతగాళ్ల శ్రీనివాసులు ఖండించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త మల్లేష్‌పై దాడి చేసిన వారిని గుర్తించి శిక్షించాలన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉమామహేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, నాయకులు బాలరాజు, రాజమౌళి, అశోక్, రేణయ్య, శ్రీశైలం, తిర్పతయ్య తదితరులు ఉన్నారు.

వీసీల నియామకంపై కేంద్ర ప్రభుత్వ జోక్యం తగదు



మాట్లాడుతున్న శేఖర్

కొల్లాపూర్: యూనివర్సిటీల్లో వీసీల నియామకంపై కేంద్రం పెత్తనం తగదని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు డి.శేఖర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తీరు కేంద్రానికి మద్దతుగా ఉన్నట్లు కనబడుతోందని ఆరోపించారు. యూనివర్సిటీలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ప్రాంతీయ విద్యార్థులకు అన్ని రకాలుగా నష్టం చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు జయరాం, మాసూమ్‌బాబా, మహ్మద్ సోహైల్, శివ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఆకుతోట ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరి ఆలయంలో స్వామివారికి అర్చకుడు లోకేశ్వరయ్య పూజలు నిర్వహించి గుడికి తాళాలు వేశారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు విరగొట్టి ఆలయంలోకి వెళ్లారు. హుండీలో నగదుతో పాటు స్వామివారి వెండి ఆభరణాలు, భక్తులు సమర్పించిన కళ్లు, మీసాలను ఎత్తుకెళ్లారు. ఉదయం అర్చకుడు ఆలయానికి రాగా అప్పటికే గుడి తెరచిఉండటంతో దొంగతనం అయ్యిందని భావించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన వెంకటేష్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. వెంకటేష్ భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

ఊర్కొండ: పిల్లలు పనిలో పెట్టుకుంటే కేసు నమోదు చేస్తామని ఆపరేషన్ స్మైల్ ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర జాతరలో కొబ్బరికాయల వేలంపాట దక్కించుకున్న యజమాని రమేష్ 18సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్నారు. ఆపరేషన్ స్మైల్ టీం ముగ్గురు బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించారు. నాగర్‌కర్నూల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలకార్మికులను మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించనునట్లు ఎస్‌ఐ తెలిపారు. యజమాని రమేష్పై లేబర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ శ్రీశైలం, తదితరులు ఉన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలించిన అధికారులు



వరిదేల శివారులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల శివారులో సోమవారం మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. పంటల సాగు విధానాల గూర్చి రైతులతో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న పంటలపై ఎండు తెగులు, కత్తెరపురుగు ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఎండుతెగులు నివారణకు మొక్కజొన్న పంట 45 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు అమిస్టర్ టాప్ 200 ఎంఎల్, లేదా కస్టోడియా 300 ఎంఎల్ చొప్పున స్ప్రే చేయాలని సూచించారు. కత్తెర పురుగు నివారణకు స్పినెటోరం 100 ఎంఎల్ చొప్పున స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చిన్నహుస్సేన్‌యాదవ్, ఏఈఓ సూర్యతేజ తదితరులు ఉన్నారు.